

అవతరణ వేడుకల్లో అపశ్రుతి.. బాలుడికి గాయాలు

చేగుంట, జూన్ 2 : తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పటాకులు కాలుస్తుండగా బాలుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. గ్రామంలోని గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ శ్రేణులు తెలంగాణ అవతరణ వేడుకలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పటాకులు కాలుస్తుండగా రోడ్డు పక్కన నిల్చున్న మక్కరాజపేట గ్రామానికి చెందిన రాజేందర్ అనే బాలుడికి తగిలి కంటికి స్వల్పగాయమైంది. అక్కడే ఉన్నవారు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.





సంగారెడ్డి కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ఘనంగా అవతరణ వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనల

సంగారెడ్డి టౌన్, జూన్ 2 : అందరి భాగస్వామ్యంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్నామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆదివారం ఆమె జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రసంగిస్తూ తెలంగాణ అమరవీరుల ఆశయాలు, ఆకాంక్షల మేరకు జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అన్నిరంగాల్లో జిల్లా ప్రగతి పథంలో ముందడుగు వేస్తున్నదని పేర్కొన్నారు. అన్ని సామాజికవర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా.. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాలకు సమాన ప్రాధాన్యమిస్తూ సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తున్నామని అన్నారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థంగా అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందజేసేందుకు నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరులైనవారి ఆశయాలు, ఆకాంక్షలను సాధించడమే మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు పేరుపేరుణా వందనాలు తెలిపారు. సమాజంలో శాంతిని నెలకొల్పడంతో పాటు జిల్లా ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలోవివిధ రకాల నేరాల నియంత్రణలో అప్రమత్తంగా వుంటూ పౌరుల భద్రతకు జిల్లా పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తున్నదని అభినందించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలనే లక్ష్యంతో కమ్యూనిటీ పోలీసింగ్, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. మహిళల రక్షణకు పెద్ద పీట వేస్తు సబ్ డివిజన్లలో షీటీం బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ షీటీం బృందాల ద్వారా బస్టాప్‌లు, కళాశాలలు, జనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిరంతరం పహారాకాస్తూ మహిళలకు రక్షణ కల్పిస్తున్నాయని తెలిపారు. భద్రతనిస్తున్న భరోసా సెంటర్లలో బాధిత మహిళల్లో కొండంత ధైర్యాన్ని నింపుతూ, వారి సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ కృషిచేస్తున్నదని కొనియాడారు. జిల్లాలో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను పటిష్టంగా అమలు చేయడానికి అంకితభావంతో పనిచేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. పారదర్శకంగా పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ చెన్నూరి రూపేష్, జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, కలెక్టరేట్ ఏవో పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో పోలీసులు గౌరవవందనం సమర్పించారు.



ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భరతనాట్యం, తెలంగాణ సంస్కృతిని తెలిపే కళా ప్రదర్శనలు అలరించాయి. డీఆర్డీఏ ఆధ్వర్యంలో తయారుచేసిన ప్లాస్టిక్ రహిత బ్యాగులు, కుండలు తదితర వస్తువులను కలెక్టర్ ఆవిష్కరించారు.



సంగారెడ్డిలో జరిగి తెలంగాణ అవతరణ వేడుకల్లో బాలికల కళాప్రదర్శన



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

అమరుల త్యాగఫలమే తెలంగాణ : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 2 : సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ ఉదయం 8 గంటలకు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అవతరించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలకు, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని అన్నారు. పోలీసుశాఖ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి నూతన వాహనాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఈ.కళ్యాణి, డీఎస్పీలు వేణుగోపాల్‌రెడ్డి, నరేందర్, మల్లేష్, నవీన్, లాలూనాయక్, సంగారెడ్డి పట్టణ సీఐ భాస్కర్, వెంకటేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల జీవితాల్లో మార్పు

రాష్ట్ర అవతరణ వేడుకల్లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టరేట్‌లో జెండాను ఎగురవేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్/మెదక్ అర్బన్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పును తెలియజేసేలా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఆదివారం రాష్ట్ర అవతరణ వేడుకలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రసంగించారు. ఎందరో త్యాగధనుల ప్రాణత్యాగాల ఫలితంగా దశాబ్దాల తెలంగాణ కల నెరవేరిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన అనంతరం ప్రగతిశీల రాష్ట్రంగా దూసుకుపోతున్నదని అన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సాధించిన పురోగతిని కలెక్టర్ వివరించారు. అభివృద్ధి ఫలాలను ప్రజలందరికీ అందించేందుకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు కాపాడడంలో తమవంతు కృషిచేస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. అంతకుముందు ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అలాగే, ఉత్సవాల్లో భాగంగా కలెక్టర్ తన కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ బాలస్వామి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీ రాజేష్, ఆర్డీవో రమాదేవి, డీఆర్వో పద్మశ్రీ, జడ్పీ ఛైర్‌పర్సన్ హేమలత, మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అలాగే, జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఎస్పీ డా.బాలస్వామి జాతీయజెండాను ఎగురవేశారు. ప్రజలకు, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ పనితీరు కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి సేవా పతకాలను అందజేశారు.



తెలంగాణ అమరులకు నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్



జెండాకు వందనం చేస్తున్న మెదక్ ఎస్పీ

పోలీస్ పహారా

- భద్రతా వలయంలో మెదక్ లోక్‌సభ కౌంటింగ్ కేంద్రాలు
- బీవీఆర్ఐటీ, గిరిజన గురుకులం వద్ద బందోబస్తు
- పాస్‌లున్న వారికే అనుమతి
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు



నర్సాపూర్ గిరిజన గురుకులంలో కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లు



నర్సాపూర్, జూన్ 2 : మెదక్ లోక్‌సభ కౌంటింగ్ కేంద్రాలైన నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాల, గిరిజన గురుకుల పాఠశాల పోలీస్ భద్రతా వలయంలోకి వెళ్లాయి. స్ట్రాంగ్‌రూముల వద్ద మూడంచెల భద్రతతో పాటు పోలీసు బలగాలు మోహరించి పహారా కాస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా అధికార యంత్రాంగంతో పాటు పోలీసు యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేశాయి. కౌంటింగ్‌ను భారీ బందోబస్తు మధ్య నిఘా నీడలో నిర్వహించనున్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సంబంధించిన ఈవీఎంలు అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా రెండుచోట్ల భద్రపరిచారు. భద్రపరిచిన చోటనే కౌంటింగ్ కూడా ర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డులో ఉన్న బీవీఆర్ఐటీ కళాశాలలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓట్లను లెక్కించనుండగా పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల ఓట్లను నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డులో ఉన్న గిరిజన గురుకులంలో నిర్వహించనున్నారు.

650 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు

ప్రస్తుతం మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్‌రూములలో ఈవీఎంలు ఉన్నాయి. కౌంటింగ్ సందర్భంగా అదనపు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ రోజు బందోబస్తుకు 650 మంది పోలీసు సిబ్బందిని వినియోగించనున్నారు. ఎస్పీ నేతృత్వంలో పది మంది డీఎస్పీలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 30 మంది ఎస్ఐలు బందోబస్తులో పాల్గొననున్నారు. వీరంతా సోమవారమే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకుంటారని అధికారులు తెలిపారు.

బీవీఆర్ఐటీలో ఐదు బ్లాకులలో కౌంటింగ్

బీవీఆర్ఐటీలోని ఐదు బ్లాకులలో ఐదు సెగ్మెంట్ల కౌంటింగ్‌కు సిద్ధం చేశారు. టేబుళ్లు, ఫెన్సింగ్ ఏర్పాట్లను చేశారు. గిరిజన గురుకులంలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలు ఉన్న స్ట్రాంగురూముల గది పక్కనే కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. గుర్తింపు కార్డు ఉన్నవారికే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. కౌంటింగ్‌కు వచ్చే అభ్యర్థుల ఏజెంట్లు, సిబ్బంది, అధికారులు, పోలీసులతో పాటు ఇతరుల వాహనాల పార్కింగ్ కోసం పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కౌంటింగ్ కేంద్రాలలో అభ్యర్థుల తరఫున హాజరయ్యే ఏజెంట్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కౌంటింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం ఉన్న ఏజెంట్లను మాత్రమే అనుమతించనున్నారు. కౌంటింగ్ నిర్వహించే టేబుల్స్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఏజెంట్లు ఫెన్సింగ్ బయటనే కుర్చీలలో కూర్చుని కౌంటింగ్ ప్రక్రియ చూడాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

మెదక్, జూన్ 2: మెదక్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది రెండో ర్యాండమైజేషన్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకులు, కౌంటింగ్ అబ్జర్వర్ల సమక్షంలో పూర్తిచేసినట్లు తెలిపారు. మూడో ర్యాండమైజేషన్ మంగళవారం ఉదయం 5 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపునకు అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా.. మెదక్ 14 టేబుళ్లు ఏర్పాటు చేసి 20 రౌండ్లలో లెక్కించనున్నామని తెలిపారు. నర్సాపూర్-14 టేబుళ్లు, 20 రౌండ్లు, సిద్దిపేట-14 టేబుళ్లు, 20 రౌండ్లు, దుబ్బాక-14 టేబుళ్లు, 19 రౌండ్లు, గజ్వేల్-15 టేబుళ్లు, 22 రౌండ్లు, పటాన్‌చెరు-18 టేబుళ్లు, 23 రౌండ్లు, సంగారెడ్డి-14 టేబుళ్లు, 21 రౌండ్లు, పోస్టల్‌బ్యాలెట్లు-18 టేబుళ్లు, 2 రౌండ్ల చొప్పున... మొత్తం 103 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.



గీతం కాలేజీలోని స్ట్రాంగ్‌రూం వద్ద భద్రత



గీతం కాలేజీలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

భారీ బందోబస్తు

జహీరాబాద్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం 'గీతం'లో ఏర్పాట్లు

సంగారెడ్డి క్రైం, జూన్ 2 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన గీతం యూనివర్సిటీలో ఈ నెల 4వ తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ, అదనపు ఎస్పీ, 10 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 76 మంది ఎస్ఐలు, 55 మంది ఎఎస్ఐలు, 400 మంది కానిస్టేబుళ్లు, 70 మంది మహిళా కానిస్టేబుళ్లు, 60 ఆర్మ్‌డ్‌ఫోర్స్ రెండు క్విక్ రియాక్షన్ టీంలు భద్రత విధుల్లో పాల్గొననున్నాయి. లెక్కింపు కేంద్రం లోపల, బయట అడుగడుగునా సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు పలు ఆంక్షలు విధించారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి బ్యారికేడ్లను ఏర్పాటుచేశారు. ప్రత్యేక పాసులు ఉన్నవారినే లోపలికి అనుమతించనున్నారు. ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి : సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు రూరల్, జూన్ 2 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎన్నికల అధికారి, కలెక్టరు క్రాంతి వల్లూరు తెలిపారు. రుద్రారం, గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఎస్పీ రూపేష్‌తో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం ఫలితాల వివరాలు నమోదు చేస్తారని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేక హాల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హోమ్ ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బందికి సంబంధించిన ఓట్లను 14 టేబుల్స్ ద్వారా కౌంటింగ్ చేస్తారు. ఒక టేబుల్‌కు ఒక సూపర్ వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తహశీల్దార్ స్థాయి అధికారి ఉంటారన్నారు. 14 టేబుల్స్ సంబంధించి ఎఆర్ఓలు ఉంటారని తెలిపారు. దీనితో పాటు సర్వీసు ఓటర్లకు సంబంధించి స్కానింగ్ ద్వారా కౌంటింగ్ నమోదు చేయబడుతుందని తెలిపారు.

రెండుసార్లు శిక్షణ

కౌంటింగ్ సిబ్బందికి రెండుసార్లు శిక్షణ ఇచ్చామని, ఇద్దరు అబ్జర్వర్లు గోపాల్ జి తివారి, ప్రదీప్‌సింగ్ సంగ్వాత్‌లు ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రక్రియలను పరిశీలిస్తారనిన్నారు. బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి ప్రతీ ఒక్కరికి డ్యూటీ పాస్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ఉంటారని, వారికి కూడా పాస్‌లు ఇవ్వడం జరుగుతుందని, పాస్‌లు ఉన్నవారికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ సిహెచ్ రూపేష్ మాట్లాడుతూ గీతం యూనివర్సిటీలో కౌంటింగ్ కోసం మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతీ స్ట్రాంగ్‌రూమ్ వద్ద సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో పాటు స్టేట్ సాయుధ సిబ్బంది, ఎఆర్ ఫోర్స్, సివిల్ ఫోర్స్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీసులకు సేవా పతకాలు

మెదక్ అర్బన్, జూన్ 2: విధి నిర్వహణలో ప్రతిభను కనబరిచిన పోలీసు అధికారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకాలను ప్రకటించింది. మెదక్ జిల్లా నుంచి వివిధ విభాగాల్లో ఏడుగురు పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు పతకాలు లభించాయి. జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఎస్పీ చేతుల మీదుగా సేవా పతకాలను అందుకున్నారు. అవార్డులు పొందిన వారిలో డీఎస్పీ సైదులు(మెదక్), ఎస్ఐగౌస్(కొల్చారం), ఏఎస్ఐ మల్లప్ప(తూప్రాన్), హెడ్ కానిస్టేబుల్ రవీందర్(అల్లాదుర్గం), ఏఆర్ఎస్ఐ అశోక్(హెడ్ క్వాటర్), ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ షాహెద్ అలీ(హెడ్ క్వాటర్), ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ పసియొద్దిన్ (హెడ్ క్వాటర్) ఉన్నారు.



మెదక్ ఎస్పీ బాలస్వామి చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకం అందుకుంటున్న డీఎస్పీ సైదులు

తపాస్‌పల్లిలో 'సోషల్ పంచాయితీ'

● గ్రామసమస్యలపై సోషల్‌మీడియాలో యువకుల పోస్టులు

● మూడు నెలలుగా వేధిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు


సమస్యలపై చేసిన పోస్టులను చూపుతున్న యువకులు

చేర్యాల, జూన్ 2: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యల పట్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారు. సదరు యువకులు మూడు నెలలుగా వేధిస్తున్నారంటూ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇటీవల కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తపాస్‌పల్లి గ్రామం కొమురవెల్లి మండల సరిహద్దులో ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది. గ్రామంలో తాగునీటి సమస్య నెలకొనడంతో పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు యువకులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. బోర్లు పాడైపోయినా త్వరితగతిన మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతుందని ప్రస్తావించారు. అయితే తమకెలాంటి సంబంధంలేని విషయాలను ప్రస్తావిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని యువకులపై కొమురవెల్లి పోలీసులకు మూడు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి పంచాక్షరి ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీకి సంబంధంలేని విషయాలకు తనకు ఆపాదిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చేస్తూ అవమానిస్తున్నారని, మూడు నెలలుగా వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. సమస్యలను పరిష్కరించకుండా తమపై తప్పుడు ఫిర్యాదు చేసిందని యువకులు పేర్కొంటూ.. వారు సైతం అదే రోజు పంచాయతీ కార్యదర్శిపైన ఫిర్యాదు చేశారు.


శివ్వంపేటలో షాపుపై విరిగిపడిన వేప చెట్టు


శివ్వంపేట మండలం గూడూరులో కారుపై విరిగిపడిన వృక్షం


హుస్నాబాద్ పట్టణంలో జలమయమైన రోడ్డు

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వాన

● ఉమ్మడి మెదక్ జిల్లాలో విభిన్న వాతావరణం

● బెజ్జంకిలో 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

● కట్కూర్‌లో 7.8 సెంటీ మీటర్ల వర్షపాతం

మెదక్ అర్బన్, జూన్ 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో విభిన్న వాతావరణం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆదివారం సాయంత్రం ఐదింటి దాకా భానుడు భగభగతో ఉక్కిరిబిక్కిరి చేయగా.. సాయంత్రం ఒక్కసారిగి భారీ వర్షం కురిసింది. పగటి ఉష్ణోగ్రత 44.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వానలు కురిశాయి. ఆదివారం అత్యధికంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో 44.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మెదక్ జిల్లా డి.ధర్మారంలో 43.4, సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 42.9 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కట్కూర్‌లో 7.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా నంగునూరులో 6.2 సెం.మీ., సముద్రాలలో 6.05 సెం.మీ., గండిపల్లిలో 3.6 సెం.మీ., హుస్నాబాద్‌లో 3.5 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. మెదక్ జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం పడింది. జిల్లాలో కేంద్రంలో దాదాపు అరగంట పాటు వర్షం కురిసింది. ఈదురు గాలులకు గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మెదక్ జిల్లా కొల్చారంలో 4.9 సెం.మీ., మిన్పూర్‌లో 4.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లాలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఈదురు గాలులకు విరిగిపడ్డ భారీ వృక్షాలు

శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలి, ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి మండల పరిధిలోని గూడూరు గ్రామంలో దర్గా వద్ద వంద సంవత్సరాల నాటి భారీ రాగి వృక్షం విరిగి పార్కింగ్ చేసిన కారు పైన పడింది. కారు పూర్తిగా ధ్వంసంకాగా, ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్టును తొలగించారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో వేపచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అదేవిధంగా సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అలాగే టవర్ విరిగిపడడంతో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగిపడ్డాయని ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు.

జలమయమైన రహదారులు

హుస్నాబాద్/అక్కన్నపేట: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో జోరుగా వర్షం కురిసింది. గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో హుస్నాబాద్ పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఈ వర్షంతో వాతావరణం చల్లబడిందని పేర్కొంటున్నారు. హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరలో వర్షం కారణంగా నీరు నిలిచిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోహిణి కార్తె ప్రారంభం అవడం, తొలకరి వర్షం కురవడంతో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

వానాకాలం కరెంటుతో జాగ్రత్త

● విద్యుత్ పనులకు రైతులు దూరంగా ఉండాలి

కొల్చారం, జూన్ 2: వానాకాలంలో కరెంటు పనులకు రైతులు దూరంగా ఉండడమే మేలని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్య ఏర్పడితే స్వీయ మరమ్మతులకు పూనుకోకుండా ఆ శాఖ అధికారులకు సమాచారమిచ్చి, సమస్యను పరిష్కరించుకోవడమే ఉత్తమమని పేర్కొంటున్నారు. రుతుపవనాలు వచ్చే సమయంలో భీకర ఈదురు గాలులు, వర్షాలతో విద్యుత్ తీగలు తెగి, బోర్‌మోటార్‌కు తగిలే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి. చిన్న సమస్యే కదా అని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. సమస్య ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలంటున్నారు.



మోటారు ఆన్ చేసేప్పుడు అప్రమత్తత అవసరం

బోర్ మోటార్లు ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఈదురుగాలులకు కొన్నిసార్లు తీగలు తెగిపోతుంటాయి. అన్ని తీగలు, ఫ్యూజ్‌లను తరచూ పరిశీలించిన తర్వాతే మోటారును ఆన్ చేయాలి. వర్షం పడుతున్నప్పుడు బోర్ వేయకపోవడం ఉత్తమం. బోర్‌బావుల్లో కంపెనీ మోటార్లే వాడాలి. వారు నిబంధనల ప్రకారం పరికరాలను తయారు చేసినందునా కాలిపోయినా విద్యుత్ సరఫరా కాదు. అవి కాలిన సందర్భాల్లో పైపుల వరకు విద్యుత్ సరఫరా అవుతుంటుంది. అలాంటి సమయంలో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

ఇనుప డబ్బాలతో ప్రమాదం

మూతల్లేని స్టార్టర్లు, ఇనుప డబ్బాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. మూతలు లేకపోతే వానలకు లోపలి భాగం తడిసిపోతుంది. ఆ సమయంలో మరమ్మతులకు ప్రయత్నిస్తే నష్టం జరగొచ్చు. తీగలు కాలి ఇనుప డబ్బాలకు తగిలితే ప్రాణాంతకమవుతుంది. డబ్బా దగ్గరకు వెళ్లినప్పుడు కాళ్లకు చెప్పులు, చేతి తొడుగులు ధరించాలి. నాణ్యమైన ప్లాస్టిక్ డబ్బాలు అందుబాటులోకి వచ్చినందున వాటిని వాడుకోవడం మంచిది.

విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి

పొలాల్లో వదులు తీగలు గమనించినా, స్తంభాలపై మరమ్మతులు చేయాల్సి వచ్చినా విద్యుత్తు శాఖ అధికారులకు, సిబ్బందికి మౌఖికంగా లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిర్ణీత గడువులోపు సరిచేయకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించుకోవాలి. రైతులే సొంతంగా మరమ్మతులు చేయడం మంచిది కాదు.

సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలి



వానకాలం వస్తుండగానే రైతులు పంట చేల్లో కరెంటు మోటార్లు మరమ్మతులు చేస్తుంటారు. పంటపొలాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు వేలాడుతుంటే మా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. రైతులే సొంతంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టరాదు. ప్రమాదాలను కొని తెచ్చుకోరాదు.

- హైమద్ అలీ, విద్యుత్ సహాయ ఇంజనీర్, కొల్చారం

జీలుగ సాగుకు రైతుల ఆసక్తి

● బోనస్ ప్రకటనతో సన్నాలపై దృష్టి

● సన్నాలు బాగా పండాలంటే పచ్చిరొట్టయే ప్రధానం

● విత్తనాల కోసం మెదక్ జిల్లా రైతుల ఎదురుచూపు

మెదక్, జూన్ 2: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకంతో కలిగే దుష్ఫలితాలపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో రైతులు భూసారం పెంపొందించడానికి జీలుగ విత్తనాలు వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా సన్నరకం వడ్లపై ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో రైతులు దొడ్డురకానికి బదులుగా సన్నాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నేల తడవడంతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. వరినాట్లకు నెల రోజుల ముందే పచ్చిరొట్ట ఎరువు సమకూర్చుకోవాలి. అయితే మెదక్ జిల్లాలో పచ్చిరొట్టతో పాటు ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పలు చోట్ల రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. డిమాండుకు సరిపడా జీలుగ అందివ్వడంలో జిల్లా వ్యవసాయాధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఖరీఫ్ సీజన్‌లో 3,73,509 ఎకరాల్లో సాగు

ఈ వానాకాలం సీజన్‌లో మెదక్ జిల్లాలో 3,73,509 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 3,27,113 ఎకరాల్లో వరి పంట వేయనున్నారు. ఇందులో 80 శాతం దొడ్డురకం వరిపంటే సాగు చేస్తారని అధికారులు ముందుగా అంచనా వేశారు. ప్రభుత్వ బోనస్ ప్రకటనతో రైతులు తమ ప్రణాళిక మార్చుకుని సన్నాలవైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం జిల్లాలో 50 శాతం సన్నరకం వరి సాగయ్యే అవకాశముందని భావిస్తున్నారు. ఇందుకోసం సంప్రదాయక ఎరువులపైనే రైతులు దృష్టి పెట్టారు. నిస్సారమైన నేలలున్న చోట పచ్చిరొట్ట ఎరువులు వేస్తే ఫలితముంటుందని, భూసారం అధికంగా ఉంటేనే సన్నరకం పంట దిగుబడులు బాగా వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరి నాటేసే ముందు జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట సాగు చేసేందుకు రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారు.


రామాయంపేటలో జీలుగ విత్తనాలు విక్రయిస్తున్న డీలర్ (ఫైల్)

6,400 క్వింటాళ్ల పచ్చిరొట్ట సరిపోయేనా?

జిల్లా వ్యాప్తంగా 3లక్షల 73 వేల ఎకరాల పంటలకు ఇప్పటి వరకు 4,462 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మాత్రమే రైతులకు పంపిణీ చేశారు. 1,938 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత డిమాండ్ ప్రకారం ఇవి సరిపోవని భావిస్తున్నారు. సన్నరకం వరికి మొగ్గు చూపుతున్న నేపథ్యంలో మరో 5 వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. అయితే రైతులందరూ సంప్రదాయక ఎరువులను వినియోగించరనే అభిప్రాయాన్ని వ్యవసాయాధికారులు వ్యక్తం చేస్తున్నారు. అందుకనే పంటల ప్రణాళికలో పచ్చిరొట్ట ప్రాధాన్యతను తగ్గించారు. గత రెండేళ్లుగా సంప్రదాయ ఎరువుల వాడకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన పెంపొందించడం ఒక ఎత్తైతే, సన్నరకం వరి సాగు రెట్టింపవ్వడం తదితర కారణాలతో పచ్చిరొట్ట వేయడంపై ఆసక్తి కనబరుస్తున్నారు.

జీలుగ విత్తనాల కొరత లేదు

మెదక్ జిల్లాలో జీలుగ విత్తనాల కొరత లేదు. ఈ సీజన్‌కు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తాం. దొడ్డురకం వరిపంట సాగుకు జీలుగు విత్తనాలు ఏ మేరకు అవసరం పడతాయో ప్రణాళికను రూపొందించుకున్నాం. సుమారు 6వేల క్వింటాళ్ల విత్తనాలు సరిపోవాలి. కానీ జిల్లాలో సన్నరకం వరి సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతుండడంతో పచ్చిరొట్ట విత్తనాల అవసరం పెరిగింది. దుక్కులు దున్నడానికి ఇంకా పదిహేను రోజులు సమయం ఉన్నందున విత్తనాలను సమకూర్చుతాం. రైతులు ఆందోళన చెందవద్దు.

- గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి, మెదక్

మండి బిర్యానీ వికటించి ఆరుగురికి తీవ్ర అస్వస్థత

● కేసు నమోదు చేసిన పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 2: మండి బిర్యాని తిని ఐదుగురికి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎస్.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన మద్యటి ఉషారాణి మరో 8మంది బంధువులతో కలిసి మే 31న యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరిలోని సువర్ణగిరి ఆలయానికి వెళ్లారు. దర్శనం పూర్తి అయ్యాక రాత్రి 10 గంటలకు కారులో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఘట్‌కేసర్‌లో భోజనం కోసం అరేబియన్ మండిలో బిర్యాని తినడానికి వెళ్లారు. తొమ్మిది మందిలో ఉషారాణి, చందు, మహేష్, రేణుక, అశోక్, మౌనిక మండిలో బిర్యాని తినగా, మిగిలిన ముగ్గురు భోజనం చేయలేదు. అనంతరం నర్సాపూర్‌లోని ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి మండి బిర్యాని తిన్న ఆరుగురు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, కల్తీ ఆహారం తీసుకోవడం వల్లే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆదివారం ఉషారాణి తండ్రి కోలోజు నర్సింహ్మాచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కల్తీ ఆహారం విక్రయిస్తున్న అరేబియన్ మండి యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు.

మల్లన్న ఆలయంలో భక్తజన హోరు

● స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం


పట్నాలు రచించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చేర్యాల, జూన్ 2: కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తజనంతో హోరెత్తింది. స్వామివారి దర్శనార్థం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. మట్టికుండలో బోనంచేసి భక్తి ప్రపత్తులతో చలక, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని, ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడి బియ్యాలు పోశారు. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగి రేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారాయి. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లలో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.


స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు


ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజనసందోహం

కిటకిటలాడిన వనదుర్గా మాత ఆలయం


అమ్మవారి మూలవిరాట్

పాపన్నపేట: మెదక్ జిల్లాలోని ఏడుపాయల వన దుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కరీంనగర్, నిజామాబాద్, జంటనగరాలు, పొరుగు రాష్ట్రాలైనా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు దుర్గమ్మ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. మంజీరా నదిపాయల్లో స్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకున్నారు.


ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తుల క్యూ


సంగారెడ్డి జడ్పీ కార్యాలయ ఆవరణలో జెండాకు వందనం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్


సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


కొండాపూర్‌లో జెండాను ఎగురవేసి జాతీయ గీతం ఆలపిస్తున్న ఎంపీపీ, అధికారులు


మునిపల్లి పీహెచ్‌సీలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న డాక్టర్ మనుజ, సిబ్బంది


నారాయణఖేడ్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి


కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న అధికారులు, సిబ్బంది


జహీరాబాద్: ఆర్డీవో కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఆర్డీవో రాజు


జహీరాబాద్: కోర్టు ఆవరణలో జెండాకు వందనం చేస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి సూరిక్రిష్ణ

నిరాడంబరంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఎలాంటి ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా నిర్వహించారు. ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అలాగే వివిధ పార్టీల కార్యాలయాల్లో రాష్ట్రావతరణ వేడుకలను జరుపుకున్నారు.

సంగారెడ్డి రూరల్, జూన్ 2: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపైన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో ఆ పార్టీ నాయకులు జెండాను ఎగురవేశారు. ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కంది:** కంది ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ కొండల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులతో కలిసి జెండాను ఎగరవేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ రాథోడ్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి మాజీ ఆత్మకమిటీ చైర్మన్ కృష్ణాగౌడ్, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపూర్:** మండల కేంద్రమైన కొండాపూర్‌తో పాటు ఆయా కార్యాలయాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీపీ మనోజ్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, ఎంపీటీసీలు శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

● **మునిపల్లి:** మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ శైలజ, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తెన్‌మొళి, మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆసుపత్రిలో డాక్టర్ మనుజ, మునిపల్లి రైతు వేదికలో ఏవో శివకుమార్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సురేష్, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగుర వేసి జాతీయ గీతం పాడారు. అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

● **హత్నూర:** హత్నూర మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీపీ నర్సింహులు, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ సుభాష్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఫర్హీన్ షేక్, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేకాధికారులు జాతీయ జెండాలను ఎగుర వేశారు. దౌల్తాబాద్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఉద్యమంలో పాల్గొన్న పలువురికి శాలువాలు, పూలమాలలతో ఎంపీపీ నర్సింహులు సన్మానించారు.

● **జిన్నారం:** జిన్నారంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, తహసీల్దార్ భిక్షపతి, బొల్లారం మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రోజారాణి, కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఎగురవేశారు. బొల్లారంలో సోనియాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

● **కల్హేర్:** కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కల్హేర్ ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపీపీ గుర్రపు సుశీల, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈవో శంకర్, ఎస్ఐ వెంకటేశం, జీజేసీ ప్రిన్సిపాల్ అసద్ ఫరూఖ్ జాతీయ జెండాలు ఎగురవేశారు. సిర్గాపూర్‌లో ఎంపీపీ జారా మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఉమాశంకర్, ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, ఉన్నత పాఠశాలలో హెచ్ఎం, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్, బొక్కస్‌గామ్ పీఏసీఎస్‌లో డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, పోచాపూర్‌లో హెచ్ఎం, జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ జాతీయ జెండాలు ఎగురవేశారు.

● **నారాయణఖేడ్:** ఖేడ్‌లోని ఇందిరా చౌక్ వద్ద డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యాలయంలో సీనియర్ నాయకులు రాములు చిస్తీ, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో అశోక చక్రవర్తి జాతీయ పతాకాలను ఎగుర వేశారు. శ్రీకాంతాచారి చౌక్ వద్ద ఆయన విగ్రహానికి పట్టణ బీజేపీ అధ్యక్షులు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో పాటు నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన ఉద్యమకారులు పాల్గొన్నారు.

● **మనూరు:** మండలంలోని ఎంపీడీవో, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఐకేపీతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో అలవేలి మంగా, ఎస్ఐ అంబ్ర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **కంగ్టి:** కంగ్టిలో జీపీ వద్ద ప్రత్యేకాధికారి సంజీవ్, మండలపరిషత్ వద్ద ఎంపీపీ సంగీత, సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, పీఎస్ వద్ద ఎస్ఐ విశ్వజన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్వో విష్ణుసాగర్, రాజారాం తండాలో ఎంపీడీవో సత్తయ్య జాతీయ జెండాలను ఎగురవేశారు. బాణసంచా కల్చి మిఠాయిలు పంచుకున్నారు.


పటాన్‌చెరు: తెలంగాణా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

● **నాగల్‌గిద్ద:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అధికారులు, నాయకులు పాల్గొని జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మోతీబాయి రాథోడ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, తహసీల్దార్ షబానబీ, ఎంపీడీవో రాజశేఖర్, ఎస్ఐ సిద్దిరాములు, నాయకులు పాల్గొన్నారు.

● **కోహీర్:** కోహీర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కోహీర్ తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బాలశంకర్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో భారతి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ కృష్ణయ్య జాతీయ జెండాలను ఎగురవేశారు.

● **జహీరాబాద్:** జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, తదితర మండలాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద రాష్ట్ర ఫిలిండెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కోర్టుఆవరణలో సీనియర్ సివిల్‌జడ్జి సూరిక్రిష్ణ, జూనియర్ సివిల్ జడ్జి అనూష జాతీయజెండాను ఎగురవేశారు.ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాజు, వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద మార్కెట్‌కమిటీ చైర్మన్ సాయిచరణ్ జెండాలను ఎగురవేశారు. మండలంలోని హోతి(బి)లో తెలంగాణ కోసం ఆత్మార్పణం చేసుకున్న సిరిసిగ లక్ష్మణ్ యాదవ్ సమాధి వద్ద పూలమాలలు వేసి బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు దుర్గయ్య ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.


హత్నూర: దౌల్తాబాద్ తెలంగాణ తల్లి మండపం వద్ద ఉద్యమకారులను సన్మానిస్తున్న ఎంపీపీ

● **రాయికోడ్:** ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మొగులప్ప, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎమ్మార్సీ కార్యాలయంలో, గ్రంథాలయంలో ఎంఈవో శ్రీనివాస్, ప్రభుత్వ దవాఖానలో డాక్టర్ నిఖిల, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, రైతువేదిక వద్ద ఏవో అవినాష్‌వర్మ, ఐకేపీ భవంలో ఏపీఎం నర్సింహులు, మార్కెట్ కార్యాలయంలో సూపర్ వైజర్ మమత, రాయికోడ్ పంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ జగదీష్, తదితరులుజాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.

● **వట్‌పల్లి:** వట్‌పల్లిలోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, గ్రామపంచాయతీ, పాఠశాల ఆవరణలో జాతీయ జెండాలను ఎగురవేసి రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను జరుపుకున్నారు తెలంగాణ తల్లి విగ్రహానికి బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **పటాన్‌చెరు:** పటాన్‌చెరు పట్టణంలోని తెలంగాణా అమరవీరుల స్థూపం వద్ద ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్యాలయం, మార్కెట్ కమిటీ కార్యాలయం, ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల ఆవరణలో జాతీయ జెండాలను ఎగురవేశారు. పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సామయ్య జాతీయ జెండా ఎగరవేశారు. అదేవిధంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ తుమ్మలపాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి, అమరవీరులకు నివాళులర్పించారు.

● **గుమ్మడిదల:** మండల కేంద్రంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి, అమరవీరులకు నివాళులర్పించారు.


మెదక్ మున్సిపల్ కార్యాలయంలో జెండావందనం చేస్తున్న చైర్మన్ చంద్రపాల్


చిన్నశంకరంపేట: జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు


చిన్నశంకరంపేట: అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెకటేశ్వర్లు


రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ బాలలక్ష్మి


రామాయంపేటలో జెండాకు గౌరవ వందనం చేస్తున్న మున్సిపల్ చైర్మన్, సిబ్బంది


నర్సాపూర్: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండావందనం చేస్తున్న చైర్మన్ అశోక్‌గౌడ్


తూప్రాన్ తహసీల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న తహసీల్దారు విజయలక్ష్మి


శివ్వంపేట తహసీల్ కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఉద్యోగులు

మెదక్ జిల్లాలో...

మెదక్/మెదక్ అర్బన్/మెదక్ మున్సిపాలిటీ, జూన్ 2: మెదక్ జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. మెదక్ కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద జాతీయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద జడ్పీ చైర్మన్ హేమలత, టీఎన్జీవో భవన్ వద్ద జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ దిలీప్‌కుమార్, జాతీయ జెండాలను ఎగురవేశారు. బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ జెండాను ఎగురవేశారు. మెదక్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చంద్రపాల్ జాతీయ జెండాను ఎగురవేసి, అమరవీరుల స్థూపం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ జానకిరాంసాగర్, మాజీ వైస్‌చైర్మన్ రాగి అశోక్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణగౌడ్, దాయర రాజలింగం, నాయకులు ఉన్నారు.స్థానిక రాందాస్ చౌరస్తా వద్ద మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. క్యాంపు కార్యాలయంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

● **చిన్నశంకరంపేట:** మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే రోహిత్ రావు తదితరులు వేర్వేరుగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ కార్యాలయం ఎదుట ఎంపీపీ భాగ్యలక్ష్మి, తహసీల్ కార్యాలయంలో మన్నన్, పీఎస్ ఎదుట ఎస్ఐ నారాయణగౌడ్, పీహెచ్‌సీ ఎదుట వైద్యాధికారి సాయి సింధు, వ్యవసాయ కార్యాలయం ఎదుట ఏవో ప్రవీణ్, అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో దామోదర్, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

● **రేగోడు:** మండలంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ బాలలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరోజన, సెర్ప్ కార్యాలయం వద్ద అధ్యక్షులు తులసి, ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ శ్వేత, గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ సుజాత, కేజీబీవీ వద్ద ప్రత్యేక అధికారి స్వయంప్రభ, ఎమ్మార్సీ వద్ద ఎంఐఎస్ శ్వేత, గ్రామపంచాయతీ వద్ద కార్యదర్శి రమేష్ జాతీయ జెండాలను ఎగురవేశారు. ఉద్యమకారులను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

● **టేక్మాల్:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కృష్ణ, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ స్వప్న, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో రాంప్రసాద్, సొసైటీ కేంద్రం వద్ద అధ్యక్షురాలు నర్సమ్మ, పశువైద్య కేంద్రం వద్ద డాక్టర్ రమేష్, టేక్మాల్ పంచాయతీ కార్యాలయాల వద్ద అధికారులు జెండాలను ఎగురవేశారు.

● **అల్లాదుర్గం:** మండలంలోని ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడ్డి, ఈజీఎస్ వద్ద ఎంపీడీవో శంకర్ యాదవ్ జెండాను ఎగురవేశారు.

● **చేగుంట:** స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మాసుల శ్రీనివాస్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బాల్‌రాజ్, తహసీల్ కార్యాలయం వద్ద తహసీల్దార్ గియా వున్నీసా బేగం, వ్యవసాయ కార్యాలయం వద్ద వ్యవసాయ అధికారి హరిప్రసాద్, జడ్పీ కార్యాలయం వద్ద నోడల్ ఆఫీసర్ నీరజ జెండాలను ఎగురవేశారు.

● **పాపన్నపేట:** మండలంలోని ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ చందనారెడ్డి, తహసీల్ కార్యాలయం వద్ద ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు, ఠాణాలో ఎస్ఐ నరేష్, పంచాయతీల్లో కార్యదర్శులు జెండా ఎగురవేశారు.

● **రామాయంపేట:** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో జాతీయపతాకాలను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, సొసైటీ వద్ద బాదే చంద్రం, తహసీల్దార్ కార్యాలయం వద్ద రజనీ జెండాలను ఎగురవేశారు.

● **నిజాంపేట:** మండలంలోని తహసీల్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్, వ్యవసాయ శాఖ, ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి, అమరులకు ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సురేష్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

● **నర్సాపూర్:** నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అశోక్‌గౌడ్, మండలపరిషత్‌లో ఎంపీపీ జ్యోతీసురేష్‌నాయక్, పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో ఏడీ జనార్దన్‌రావు, పీఏసీఎస్ వద్ద చైర్మన్ రాజుయాదవ్, ఐకేపీ వద్ద ఏపీఎం గౌరీశంకర్, ఈజీఎస్ వద్ద ఏపీవో అంజిరెడ్డి, పతాకాలను ఎగురవేశారు.

● **కొల్చారం:** మండలంలోని ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ అధ్యక్షురాలు కొరబోయిన మంజుల, మండల వ్యవసాయ అధికారి ఏవో శ్వేతకుమారి, రైతు వేదిక వద్ద ఏఈవో వినీత భవాని, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి అంజయ్య, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ మహ్మద్ గౌస్, రంగంపేట సొసైటీ వద్ద డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్ తదితరులు జాతీయ జెండాలను ఎగురవేశారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద స్పెషల్ ఆఫీసర్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

● **శివ్వంపేట:** మండలంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హరికృష్ణ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మహిపాల్ రెడ్డి, పీహెచ్‌సీలో డాక్టర్ సాయి సైన్య, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ వెంకటరామిరెడ్డి, వ్యవసాయ కార్యాలయంలో ఏవో లావణ్య, ఎంపీడీవో నాగేశ్వర్, నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

● **తూప్రాన్:** తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేశ్‌యాదవ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు విజయలక్ష్మి, పోలీసు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ కృష్ణ, పోలీసుస్టేషన్ వద్ద ఎస్ఐ శివానందం జెండా ఎగురవేశారు.

● **మనోహరాబాద్/ వెల్దుర్తి/ హవేళి ఘనపూర్/పెద్దశంకరంపేట/మాసాయిపేట:** మనోహరాబాద్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పురం నవనీతారవి, తహసీల్ కార్యాలయంలో చంద్రశేఖర్ రెడ్డి, పీహెచ్‌సీలో వైద్యాధికారి వికాస్ ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. వెల్దుర్తి మండలంలోని తహసీల్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రభుదాస్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ స్వరూప, ఆయా ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పెద్దశంకరంపేట మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ గ్రేస్ బాయ్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐశంకర్, ఆయా ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీకార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు.హవేళిఘణపూర్,మాసాయిపేట మండలాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 2: పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 3 వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్దార్థ హైస్కూల్ కేంద్రాలను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాల్లో 525 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్నాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనున్నది. 9.35 వరకు మాత్రమే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు మూడు సిట్టింగ్ స్క్వాడ్స్, ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నది. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏదైనా సమాచారం, సందేహాల కోసం 9866162182 నెంబరుకు సంప్రదించాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్, జూన్ 2: డీసీసీ బ్యాంక్ మరింత మెరుగైన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో జిల్లాసహకార కేంద్రబ్యాంక్ రాయికోడ్ మండల బ్రాంచ్‌లో ఇంటింటికీ డీసీసీబీ అనే నూతన పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఆదివారం మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామంలో ప్రజలకు, ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మమత మాట్లాడుతూ పిల్లల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దన్నపాటిల్, పీఏసీఎస్ చైర్మన్ నాగిశెట్టి, బ్యాంక్‌సిబ్బంది ఫీల్డ్ ఆఫీసర్ రాములు, సొసైటీ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మతల్లికి బోనాల ఊరేగింపు


హవేళిఘణపూర్‌లో బోనాలతో మహిళల ఊరేగింపు

హవేళిఘణపూర్, జూన్ 2: మండల కేంద్రంలోని నల్లపోచమ్మ దేవికి ఆదివారం బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, డీజే, డప్పు చప్పుడు మేళాల మధ్య యువతీ యువకుల డ్యాన్సులతో బోనాల ఊరేగింపు అందరినీ ఆకట్టుకుంది. మహిళలు బోనాల్లో నైవేద్యాలను తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్‌లను పరిశీలించిన ఎంపీపీ

రేగోడు జూన్ 2: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల కోసం డ్వాక్రా మహిళలు కుట్టిన యూనిఫాం దుస్తులను రేగోడు సెర్ప్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ సరోజన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫామ్‌లను కుట్టే బాధ్యత డ్వాక్రా మహిళలకు అప్పగించినట్లు తెలిపారు.

జొన్నలు విక్రయించేందుకు నేడు ఆఖరు

వట్‌పల్లి, జూన్ 2: ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాల్లో ఈ నెల 3వ తేదీ లోపు జొన్నలను విక్రయించుకోవాలని ఆర్డీవో పాండు రైతులకు సూచించారు ఆదివారం మండలంలోని కాదిరాబాద్, దేవునూర్ జొన్నల కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 3తేదీ వరకు జొన్నలు కొనుగోలు చేస్తామన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీనివాస్ డిప్యూటీ తహసీల్దార్ శాంబి రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మహేష్ చౌహాన్ ఏఈవో ప్రమీల, పాక్స్ సీఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శివ్వంపేట, జూన్ 2: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మృతి చెందిన సంఘటన ఆదివారం శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోమారం సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లాకు చెందిన కనుకుంట్ల సుశాంత్(35) రంగారెడ్డి జిల్లా చింతల్‌లో నివాసం ఉంటున్నాడు. గత నెల 28న గోమారం సబ్ స్టేషన్‌లో విధులు ముగించుకొని చింతల్‌కు వెళ్తుండగా చిన్న గొట్టుముక్క శివారులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. యశోదా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుశాంత్ ఆదివారం మృతిచెందాడు. మృతుని తమ్ముడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

మహిళ పుస్తెలతాడు చోరీకి యత్నం

శివ్వంపేట, జూన్ 2: మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు చోరీకి యత్నించిన సంఘటన మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిన్న గొట్టిముక్ల గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓ మహిళ దాబాపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని వచ్చి ఆమె మెడలో నుంచి పుస్తెలతాడు పట్టుకుని లాగుతుండగా మేల్కొని అప్రమత్తమైన మహిళ పుస్తెలతాడును గట్టిగా చేతితో పట్టుకొని అరవడంతో దుండగుడు పరారయ్యాడు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ మహిపాల్ రెడ్డిని సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

బస్టాండ్‌లో వృద్ధురాలి మృతి


మృతి చెందిన వృద్ధురాలు

తూప్రాన్, జూన్2: తూప్రాన్ పట్టణ ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో వారం రోజులుగా భిక్షాటన చేస్తున్న వృద్ధురాలు ఆదివారం సాయంత్రం బస్టాండ్ ఆవరణలో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఆకలితో లేదా వడదెబ్బతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

యావాపూర్ ఘటనలో మూడుకు చేరిన మృతుల సంఖ్య


మృతిచెందిన పోచయ్య

తూప్రాన్, జూన్ 2: మండలంలోని యావాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడినవారిలో మరో వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఆనంతగిరిపల్లికి చెందిన కర్రె జోయల్ (సాయి) వివాహం 20న చేసేందుకు నిశ్చయించారు. జోయల్ పెళ్లి ఏర్పాట్లలో అతడి అన్న కర్రె నర్సింహులు(44) బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన పెద్దనాన్న తొంటోళ్ల పోచయ్య (58)తో కలిసి నర్సింహులు ద్విచక్ర వాహనంపై తూప్రాన్‌కు వచ్చి ఆనంతగిరిపల్లికి తిరుగుప్రయాణమయ్యారు. అదే సమయంలో వారితోపాటే హార్వేస్టర్ పనులు చూస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన మోహన్ రాజ్, సతీష్‌కుమార్ మరో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గజ్వేల్ - తూప్రాన్ రోడ్డుపై వారు తూప్రాన్ మండలంలోని యావాపూర్ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన అశోక్ లీలాండ్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు ఎగిరి దూరంగా పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ఆ రోజే కర్రె నర్సింహులు (44) మృతిచెందగా, అనంతరం తమిళనాడు రాష్ట్రానికి చెందిన మోహన్‌రాజ్ మరణించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కండ్లకోయకు చెందిన తొంటోళ్ల పోచయ్య (58)శనివారం రాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

'ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే'

సంగారెడ్డి రూరల్, జూన్ 2: ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోరాడేది ఎర్రజెండాయేనని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్ర ప్రసాద్ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారి వ్యవస్థ ఉన్నంత వరకు ఎర్రజెండా తన పోరాటాలను అణగారిన వర్గాల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. పెట్టుబడిదారి ఉన్న దేశాల్లో ఆర్థిక రాజకీయ, సామాజిక అసమానతలు పెరిగిపోయాయని, ఆయా దేశాలు తీవ్ర ఆర్థిక మాంద్యంలో కొట్టుమిట్టాడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, రాజయ్య, జీ. సాయిలు, నాయకులు విద్యాసాగర్, మహిపాల్, యాదగిరి, పాండురంగారెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు